# బుద్బుదం

"నీట్లో లేచిన బుడగ ఎంతోసేపు ఉంటుందా? ఉండదు. ఏమవుతుంది? బద్దలై పోతుంది. బద్దలవడం అంటే ఏమిటి? అంటే నీట్లో మళ్లీ కలిసిపోవడమే కదా? అంటే ఏంవన్నమాటా? - బుడగ నీట్లోంచి లేచింది, నీట్లోనే కలిసిపోయింది. నీరు నీర్లోనే ఉన్నప్పుడు ఆ నీరు పుట్టడం ఏమిటి? ఆ నీరు చావడం ఏమిటి? అందులో అర్థం లేదుకదా! అంతా అసందర్భమే కదా? ఆ సంగతి మీకు బోధపడింది కదా! అందుచేత తెలిసికోండి ఆ నీరు ఏవిధంగా అయితే పుట్టలేదో చావలేదో ఆ విధంగానే ఆత్మపదార్థం అనేది పుట్టదు, చావదు!

అని శాస్త్రులుగారు ఓ సాయంత్రం సీతారామస్వామివారి గుళ్లో పెట్రోమాక్సు లైటు వెలుగులో స్వచ్ఛంగా, శాంతంగా కూర్చొని కొన్ని పరమ రహస్యాలు పామరులందరికీ తేటతెల్లంగా తెలియజేసేరు.

"భేష్" అన్నారు పామరులు.

సాయంత్రం ఆరుకి ఆరంభించిన ఉపన్యాసం ఆ దినం రాత్రి తొమ్మిది గంటలకి ముగిసింది. పెట్రోమాక్సు దీపం ఎలా తెల్లగా వెలిగిందో అలా తేటతెల్లంగా అంతా వివరించి చెప్పేరు శాస్త్రులుగారు. అక్కడ చేరిన పామరుల ముఖాలమీద పడిన కాంతి పెట్రోమాక్సు దీపకాంతా లేక శాస్త్రిగారి ధవళకాంతా అనే భ్రమ కలిగేట్టుగా చక్కగా నవ్వుతూ స్పష్టంగా ఉపన్యసించేరు శాస్త్రిగారు. తొమ్మిది రోజులు పురాణం చెప్పి పదో రోజున దాని సారం అంతా పిండి వడబోసి పామరులందరికీ అందజేసేరు శాస్త్రిగారు.

ఆ రాత్రి ఆ దీపం వెలుగులో గుడి స్తంభాల మీద రాతి బొమ్మలు కూడా ఓ వెలుగు వెలిగాయి. "బాబూ, తమరు మాకే కాదు వాటిక్కూడా జ్ఞానోదయం ఇప్పించ గలరు! తమరు అవతార పురుషులే కాని మరొకరుకాదు" అని ఒక పామరుడు అకస్మాత్తుగా జ్ఞానిగా మారి శాస్త్రిగార్ని శ్లాఘించేడు. శాస్త్రిగారు నిర్లిప్తంగా నవ్వేరు.

ఉపన్యాసం ముగిసింది. పామరత్వాన్ని ఆనాటికి కొంత కొంతగా పోగొట్టుకుని లేచిన సభికుల్లో పదేళ్ల శ్యాంబాబు కూడా ఉన్నాడు.

మున్సిపాల్టి వారి రికార్డుల్లో శ్యాంబాబు పేరుండదు. "ఒక మగశిశువు" అని మాత్రం ఉంటుంది. స్కూల్ రికార్డులో అతని పేరు శ్యామలరావు. వెక్కిరించాలంటే అది చీమలరావుగా పెంకె కుర్రాళ్ల పెదిమల మీద మారు రూపు చెందుతుంది. వాళ్లమ్మకి అతను శ్యాంబాబు; కాకపోతే ఇంకా క్లుప్తంగా శాంబాబు.

శ్యాంబాబు అయిదో క్లాసు చదివి ఆరో క్లాసులోకి వెళ్లలేకపోయాడు. కష్టం కష్టం. చాలా కష్టం స్కూలుకి వెళ్తే పరాజయాన్ని పదిమందిలో కూర్చుని అనుభవించడం కష్టం..

ఇంటికి వెళ్తే అమ్మ ఆయాసపు నిట్టూర్పులు వినడం ఎంతో కష్టం. అందుచేత ఆ కష్టాల్ని అతను మామిడితోటల నీడల్లోనూ, కొండగుట్టల బండరాళ్లలోనూ, సముద్రపుటలల నురుగు ముద్దుల్లోనూ, తీరాన ఇసకలో సాయంకాలపు టాటాల్లోను మర్చిపోడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

ఓనాడు సాయంకాలం చీకటిపడ్డాక శ్యాంబాబు బీచినుంచి ఇంటికి వెళ్తూ, దార్లో గుడిలో పెట్రోమాక్సు దీపపు వెలుగు చూసేడు. లోనికి వెళ్లి శాస్త్రిగారి "శాంత గంభీర వచనాలు" విన్నాడు. అక్కణ్నించి ప్రతిరోజూ అతను పురాణ శ్రవణానికి వెళ్లనారంభించేడు.

పురాణం అంతా అయింది. శాస్త్రిగారి ఆఖరి ఉపన్యాసం కూడా అయింది. భక్తులంతా ఆయన కాళ్లమీద పడి ఆయనచేత ఆశీర్వదింపబడ్డారు. శాస్త్రిగారి పాదధూళి కళ్లకి అద్దుకుని తలెత్తి శాస్త్రిగారి స్నిగ్ధ గంభీర వచనంలోకి చూసిన శ్యాంబాబు కళ్లంట ఆనందబాష్పాలు రాలేయి. అక్కడ ప్రసాదంగా పంచిపెట్టిన కొబ్బరికోరూ, వడపప్పూ చేతిలో వేయించుకొని, కళ్ల కద్దుకుని తిందాం అనుకున్నాడు శ్యాంబాబు. కాని, అంతలో దేవుడి ప్రసాదం అమ్మ కియ్యాలి అనిపించిందతనికి. గుడి పూజార్ని బతిమిలాడి రెండు బాదం ఆకులు సంపాదిచి, అందులో ప్రసాదం భద్రంగా చుట్టి చేత్తో జాగ్రత్తగా పట్టుకుని ఇంటికి బయల్దేరేడతను.

రాత్రి తొమ్మిది దాటింది. పెద్ద ఊరు కాకపోవడం వల్ల ఊరంతా చాలామట్టుకు మాటుమణిగింది. వెన్నెల్లో జనంలేని వీధుల్లో చలికి చిన్నగా వణుకుతూ నడిచే శ్యాంబాబుకి మనసెందుకో గాని ఎంతో తేలిక పడినట్టనిపించింది. నీటిబుడగలకి చావులేనట్టే మనుషులకి కూడా చావుండదనేది అతనికెందుకోగాని చాలా స్పష్టంగా బోధపడినట్టనిపించింది. అతను తేలిగ్గా నడవసాగేడు. రోడ్డంతా గోతులు గోతులుగా ఉంది. గోతులన్నీ చాలా అడ్డదిడ్డంగా ఉన్నాయి. వాటినుంచి చెంగు చెంగున అటూ యిటూ గెంతుతూ హుషారుగా నడిచేడు శ్యాంబాబు.

కార్తీకం, శుక్లసప్తమి చంద్రుడు ఓరగా ముద్దుగా నవ్వుతున్నాడు. ఆకాశంలో చుక్కలు నిర్మల సముద్రం మీద నిండిపోయిన పూలపడవల్లా, మనోహరంగా కనిపిస్తున్నాయి. ఒక మేఘం శాస్త్రిగారి తెల్లగడ్డం లాగా స్వచ్ఛంగా వెండిదూదిలా ఉంది. ఊరి సందుల్లో గాలి మత్తుగా సోలిపోయి నిద్రపోతోంది. "మంచిరాజుల" రాజ్యంలో మురికి మనుష్యులు కూడా ఆనందంగా ఉంటారుంటారన్నట్టు, మురుగు కాలువలు కూడా చందమామల వెన్నెల అలలకి మురిసిపోతున్నాయి. పాత పెంకుల ఇళ్లు కూడా అంత అందమైన రాత్రిలో అంత బరువుగా బాధగా కనిపించడానికి ఎంతో సిగ్గుపడుతున్నాయి. నాచుపట్టిన పాత డాబాలు కూడా వెన్నెలందానికి రెచ్చిపోయి సిగ్గు మర్చిపోయి సింగారాలకి సిద్ధపడుతున్నాయి. రొట్టెల షావుకారు గారి కొత్తమేడ ఆయన కొత్త కోడల్లాగే ఈ వెన్నెలంతా నాదే అన్నట్టుగా రాణీలా నిల్చుంది. పున్నమినాటి వెన్నెల్ని నీలపు తెరలోంచి చూస్తే ఉన్నట్టు సప్తమినాటి వెన్నెల రమ్యాతి రమ్యంగా రాబోయే రేపటి పెండ్లికి మరికొంత కలువకన్నియ ఈనాడు కలలో కనిపించినట్లు కడు కమ్మగా వుంది. రాత్రంతా ఎంతో చల్లగా నిన్న సాయంత్రం ఆరవేసిన అమ్మ చీర ఈవాళ తెలివేళ మెత్తగా చల్లగా ఉన్నట్టు ఎంతో మధురంగా ఉంది.

రోజూ ఎనిమిదే అయేది. ఇవాళ తొమ్మిది దాటింది. అమ్మ కోప్పడుతుందేమోననీ

రవ్వంత అనుమానం వేసింది శ్యాంబాబుకి.

అమ్మ ఎప్పుడో కాని కోప్పడదు. తను పరీక్ష తప్పినప్పుడు ఆవిడ కోప్పడలేదు. తను చూడలేదనుకొని కంటతడి పెట్టింది. అన్నకి రోషం వచ్చి కొట్టబోతే, ఆవిడ అడ్డుకొని, "తప్పమ్మా కొట్టకు" అని వారించింది. చెల్లి ఏడుస్తే, "మళ్లీ యేడు చిన్నన్న తప్పక పాసవుతాడమ్మా! ఏడవకూడదలా! తప్పు కళ్లు తుడుచుకో!" అని బుజ్జగించింది. ఆరోజున స్పెషల్‌గా తనకి వేపుడు కూర వేయించింది కూడాను.

అయితే, ఎప్పుడైనా కోప్పడుతుందమ్మ! (బ్రతుకు బండి లాగలేక గుండె నిబ్బరం లేనేలేక). తమందర్నీ విడిచి పారిపోయిన నాన్న ఫోటో చించేస్తే తనని అమ్మ చాలా కోప్పడింది. ఓసారి కాణీ పచ్చిమిరపకాయలు కొనుక్కురమ్మని తనకి పావలా యిచ్చి పంపిననాడు అది తను సినిమాబండి వెనుక పరిగెట్టడంలో పారేసినప్పుడు అమ్మ కొంచెం కోప్పడిందనే చెప్పాలి. ఈమధ్య తొలిరోజున తను పురాణానికి వెళ్లినప్పుడు కోప్పడలేదు గాని, "నాకు ఒంట్లో బాగులేనప్పుడైనా వేగిరం ఇంటికి రాకూడదుట్రా శ్యాంబాబూ?" అంది. అంతే అంది. నిన్న సాయంత్రం తను ఆడుకొందికి వెళ్తున్నప్పుడు తనతో యేదో చెప్పబోయి ఎందుకో గాని ఊరుకుంది. ఇవాళ మాత్రం, "ఒరే శ్యాంబాబూ! నా చిట్టితండ్రీ. ఇవాళైనా వేగిరం ఇంటికొచ్చేరా బాబూ" అంది.

"ఇవాళ ఆఖరోజమ్మా" అన్నాడు తను.

"ఫరవాలేదురా! వేగిరం వచ్చేయ్! రోజూ పురాణానికి వెళ్తూనే వున్నావు కదా! భగవంతుడు మెచ్చుతాడు, మరేం భయంలేదు. ఒచ్చే యేడు నిన్ను తప్పక పాసు చేస్తాడు" అంది అమ్మ.

శ్యాంబాబుకి ఎందుకోగాని సన్నగా సిగ్గువేసింది. చిన్నగా నవ్వుకూడా వచ్చింది. తను భక్తిగా, శ్రద్ధగా పురాణం వినడానికి వెళ్లడం తన పరీక్ష పాసు గురించి అనుకొంటోంది అమ్మ.

"కాదమ్మా! నీకు వేగిరం నయం కావడానికి వెళ్తున్నానమ్మా" అని చెప్పడానికి అతని కెందుకోగాని సిగ్గువేసింది.

అమ్మ వేగిరం ఇంటికి రమ్మన్న రోజునే చాలా ఆలస్యం అయింది. అమ్మ కోప్పడు తుందా! కోప్పడొచ్చు. లేకపోతే – విసుక్కోవచ్చు.... మూడొంతులు విసుక్కోవచ్చు.

ఇల్లు దగ్గరయ్యేసరికి శ్యాంబాబు నడక జోరయింది. కోప్పడ్డానికి అమ్మకి అవకాశం ఇవ్వకుండా పరిగెట్టికెళ్లి ఆమె చేతిలోకి దేముడి ప్రసాదం ఇచ్చేద్దాం అనుకున్నాడతను. అన్నకి కూడా, "అన్నయ్యా ఇందరా ప్రసాదం!" అని కొంచెం ఇస్తే వాడుకూడా ఊరుకుంటాడు. ఒకే ప్రసాదంతో ఇరువురి కోపాలు తప్పించవచ్చు కదా అనే ఉద్దేశంతో రంయ్‌మని పరుగుతీసి ఇంటికి అల్లంత దూరంలో ఆగేడు శ్యాంబాబు.

ఆరాత్రి వాళ్లమ్మ అతణ్ణి కోప్పడలేదు. ఇంటిముందు వీధిలో చాపమీద ఆమె పడుకొనుంది. ఆమె తల వెనుక అన్న కూర్చున్నాడు.. పక్కని కూర్చొని అమ్మని కావలించుకొని ఆమె కంఠంలో తల దాచుకొంది సరళ చెల్లి, అన్నకి వెనకాతల పెంకుటింటి వసారాలో ఓ హరికెన్ లాంతరు పేద ముసలమ్మలా, స్తంభానికి చేర్లబడి మినుకు మినుకు మంటోంది.

అయిదారుగురు ఆడంగులు, అద్దె వాటాలవారు మర్యాదగా తలలు వంచుకుని ఓ వార కూర్చున్నారు. పంచె కట్టుకుని తువ్వాలు భుజాన వేసుకొన్న పెద్దమనిషొకతను స్తంభాలమీద సన్నదూలం కుడిచేత్తో పట్టుకొని ఎడం చెయ్యి నడుం మీద పెట్టుకొని చిరాగ్గా నిల్చున్నాడు.

ఆ సమయంలో ఆకాశం విరిగిపడిందో, చంద్రుడు ముక్కలయేడో, చుక్కలు రాలేయో, భూమి దద్దరిల్లిందో ఉప్పెన ముంచుకొచ్చిందో, ఏం జరిగిందో, ఏం జరగలేదో తెలియదు శ్యాంబాబుకి. అమ్మ లేదని మాత్రం ఆ క్షణంలో అతను తెలుసుకున్నాడు. అతను తీసిన పరుక్కి అతని చేతిలోని ప్రసాదం కింద రాలి మట్టిలో కలిసింది.

మురికి మచ్చల చింకిచాప మీద ఆవిడ వెల్లకిలా పడుకుంది. ఆవిడ ఆ సమయంలో నిర్మలంగా నిద్రపోవడం లేదు. ప్రాణాలు పోయినా ఆవేదనలు మాత్రం మిగిలిపోయినట్టు ఆమె ముఖం ఎంతో విచారంగా వుంది. చందమామ చిలిపి శృంగారంతో చుక్కల గిలిగింతలతో తెలి వెన్నెల పట్టుతెరలతో ఆకాశం నిండా లోకమంతటా భగవంతుడు సృష్టించి గుప్పించిన "దివ్య సౌందర్యం"తో ఆమెకి సంబంధం ఏమీ లేనట్టు ఆమె ముఖం ఓ పక్కకి తిరిగి ఉంది. నా పిల్లలంతా ఏడుస్తున్నారే! వాళ్లకి నేనన్నం పెట్టలేకపోయానే! ఈతరాని పిల్లల్ని లోతు నీటిలో వదిలేసి నేనిలా శవాన్నయిపోయేనే! ఏది దారి, వాళ్లకేది దారి?" అని మూగగా విలపిస్తున్నట్టుంది ఆమె ముఖం. మూతలు పడిన ఆమె కళ్లనుంచి ఏ క్షణాన్నయినా కన్నీరు కాలవ కట్టవచ్చు. ఏ క్షణాన్నయినా ధారధారలుగా నెత్తురు ప్రవహించవచ్చు నన్నట్టుగా ఆమె ముఖం ఎంతో దీనంగా (అందుచేతనే కాబోలు) ఎంతో భయంకరంగా ఉంది.

అమ్మా నేనొచ్చాను. రేపట్నించి ఎక్కడికీ వెళ్లను. నువ్వు వెళ్లమంటేనే వెళ్తాను. వెళ్లినా ఆలస్యం చెయ్యను. శ్యాంబాబు న్నేనొచ్చేనమ్మా! నీకోసమే పురాణం! నీకోసమే ప్రసాదం! నీకోసమే దేవుడి అనుగ్రహం! నాక్కాదు నాక్కాదు! అన్నీ నీకోసమే! నీకోసం పరీక్ష పాసయి తీరుతానమ్మా! అన్నయ్యని రేపణ్నించి వండనివ్వను. నేనే వండుతాను. నేనే నీకు జావ యిస్తాను. నయమయేక నేనే నీకు అన్నం పెడతాను. నేనే పనిచేసి అన్నయ్యని చదివిస్తాను. చెల్లి పెళ్లికి కట్నం నేనేనమ్మా నేనే తెస్తాను. వెళ్లి వెతికి నాన్నని పట్టి కట్టి నీకోసం నే తెస్తాను. తప్పకుండా తెస్తాను. నిన్ను ఏడవనివ్వను. ఎప్పుడూ ఏడవనివ్వను. నువ్వు చెప్పినట్టు వింటాను. బుద్ధిగా ఉంటాను. నాన్న ఫొటో చింపను. పావలాలు పారెయ్యను. పరీక్షలు తప్పను. చెట్లెక్కను, కొండెక్కను, ఈత రాకుండా నీట్లోకి దిగను. దిగనమ్మా దిగను! లే అమ్మా లే! బుద్ధిగా ఉంటాను! కళ్లు తెరువమ్మా తెరువు. లే అమ్మా లే.

ఊరూ ఆకాశం అన్నీ విన్నాయి. అద్దెవాటాల వాళ్లుకూడా విన్నారు. ఆ ఏడుపుకి అవధులుండవనీ ఏ దేముడెంత చెప్పినా అది ఒకంతట చల్లారదని వాళ్లందరికీ బాగా తెలుసు. అంత గట్టిగా పెనుబొబ్బలు పెట్టి ఏడ్చేడు శ్యాంబాబు.

చంద్రుడు కిందికి దిగేడు. రాత్రింకా ఉంది.

నీటిబుడగ పోయినపుడు నీటిబుడగ లేడుస్తాయో లేదో భగవంతుడికే తెలియాలి. కాని, మనిషి పోతేమాత్రం మనుషులేడుస్తారు. శాస్త్రిగారూ చావు నిజం కాదని మీకు బాగా తెలిసి ఉండవచ్చు. కాని బాధ నిజమని మాత్రం శ్యాంబాబుకి మీకంటే బాగా తెలుసు.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 29-11-1968*